క్లుప్తంగా

కురిసిన జల్లులు

రాజోళి: మండలంలో పలు చోట్ల జల్లులు కురిశాయి. సోమవారం రాత్రి వాతావరణం మేఘావృతమై పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రాత్రి కురిసిన వర్షానికి మండల ప్రజలకు ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం లభించింది. కురిసిన జల్లులతో రైతులు సేద్యం పనులు మొదలు పెట్టేందుకు, దుక్కులు దున్నేందుకు సన్నద్ధమవుతున్నారు.

వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవాలు ప్రారంభం

రాజోళి: మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజున అంకురార్పణ, స్వపనం సేవ, పంచామృతాభిషేకం పూజలు చేశారు. ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రజిత అధ్యక్షతన గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ఘనంగా పుట్టాలమ్మ ఉత్సవాలు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో పుట్టాలమ్మ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు కుటుంబసభ్యులతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు.

పశువులకు టీకాలు



శాంతినగర్: పాడి పశువులు, గేదెలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యశాల సిబ్బంది సూచించారు. వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెలో పశువులకు జబ్బవాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా 133 గేదెలకు, 54 ఆవులు, ఎద్దులకు టీకాలు వేశారు. 26 మంది రైతుల చెందిన పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం



మానవపాడు: మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఏడీఏ సక్రియ నాయక్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలపై వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలపై ఈ నెల 3వ తేదీన నిర్వహించే ఏర్పాట్ల గురించి వ్యవసాయ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ సుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని పౌరులకు అందించాలి



ఉండవెల్లి: ప్రతి పౌరుడికి రాజ్యాంగ గ్రంథాన్ని అందజేయాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ జయంతికి డీఎస్పీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కుమార్, ప్రవీణ్, శాలన్న, డేవిడ్, మహబూబ్‌బాషా, మధుకుమార్, తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్య అందని ద్రాక్షేనా?

- ఇంటర్, డిగ్రీ చదువులకు విద్యార్థులు దూరం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఉండవెల్లిలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న పదో తరగతి విద్యార్థులు(ఫైల్)

ఉండవెల్లి: మండలంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయకపోవడంతో మండలంలోని పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనప్పటికి ప్రైవేట్ కళాశాలలో ఫీజులు కట్టలేక చదువులకు స్వస్తి పలకాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేకుండా పోతోంది.

మండలంలో ప్రతి సంవత్సరం ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి కనీసం 500 మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో, ఇంటర్ డిగ్రీ చదవాలంటే 16 కి.మీ దూరంలో ఉన్న అలంపూర్‌కు వెళ్లి ఇంటర్ చదవాల్సి ఉంటుంది. శాంతినగర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్న ఇంటర్ కళాశాల లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉండవెల్లి మండలంలో అలంపూర్ చౌరస్తాలో ప్రైవేట్ కళాశాలకే పరిమితమవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక ఇళ్ల వద్దనే కాలం వెళ్లదీస్తున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిదులు..

మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తే తమ కష్టాలు తీరుతాయని విద్యార్థులు, తల్లిదండ్రులు మొరపెట్టుకున్నా ఫలితం దక్కడం లేదు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా కార్యరూపం దాల్చడం లేదు. పాలకులు పట్టించుకోకపోవడంతో పేద విద్యార్థుల నానా అవస్థల పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలి..

మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి. పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాల ఫీజులు కట్టలేక చదువులకు దూరం అవుతున్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థుల భవిష్యత్ కూడా అగమ్యగోచరంగా మారింది. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

– యాకుబ్ బాషా, ఉండవెల్లి

అనుమతి వస్తే పరిశీలిస్తాం..



ఉండవెల్లి మండలంలో ఎలాంటి ప్రతిపాదనలు అందలేదు. ఉండవెల్లి మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వస్తే ప్రభుత్వానికి తెలిపి త్వరలో అనుమతిని తీసుకొస్తాం.

– హృదయరాజు, జిల్లా నోడల్ అధికారి

మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వీఎం అబ్రహం

గద్వాల రూరల్: హైదారాబాదులో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వీఎం అబ్రహంలు కుర్వ యాదవులతో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని అర్హులైన కుర్వ గొల్లలకు గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి తలసానిని గొంగడితో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

మానవపాడు: గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బోరవెల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన విశ్వేశ్వరయ్య(40) అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మద్యం పట్టివేత



అయిజ: మండలంలోని పులికల్ సమీపంలో నాగల దిన్నె వంతెన వద్ద మంగళవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ (ఎస్‌హెచ్‌ఓ) గోపాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా సీ బెలగల్ మండలం గుండ్రేవులకు చెందిన బోయ దస్తగిరి కర్నాటక రాష్ట్రంలోని తలమరి గ్రామం నుంచి మండలంలోని నాలగదిన్నె బ్రిడ్జి మీదుగా బైక్‌పై మద్యాన్ని తరలిస్తున్నాడు. అయితే ఎక్సైజ్ ఎస్‌ఐ గోవర్ధన్ పోలీస్‌సిబ్బందితో తనిఖీ చేయగా దస్తగిరి పట్టుబడ్డాడు. 48 బాటిళ్లు, 90 ఎంఎల్‌కు సంబంధించిన 96 టెట్రా ప్యాక్‌లుతోపాటు బైక్‌ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



గద్వాలలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



మానవపాడులో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ వర్కర్లకు కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీఓ రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జమ్మిచేడుకార్తీక్, రాఘవేంద్ర, శ్రీను, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: పీఆర్సీ నివేదిక ప్రకారం బేసిక్ వేతనం చెల్లించాలని ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కో కన్వీనర్ జమ్మిచేడు కార్తీక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ రమణరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సుజాత, వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ పద్మావతికి తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యునియన్, జిల్లా కోకన్వీనర్ కార్తిక్ మంగళవారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 51 జీఓను సవరించి, నెలకు రూ.19 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరుశరాముడు, వెంకటేష్, శ్రీను, భీమేష్, తిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఏఎస్‌ఐ జిక్కిబాబు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం యాపల్‌దిన్నె గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ ఆంజనేయ తెల్లవారు జామున గ్రామం వాగు నుంచి పాతపాలెం గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడు. అందుకున్న సమాచారంతో ఈర్లబండ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



బోరవెల్లిలో విత్తనాలు పరిశీలిస్తున్న చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

మానవపాడు: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యుడు నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం మండలంలో వెంకటేశ్వర సీడ్స్ బోరవెల్లి, మానవపాడు మనగ్రోమోర్ సెంటర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ భారత్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, పురుగుమందులను పరిశీలించారు. విత్తనాలు, మందులు కొనుగోలు చేసిన రైతులకు ఖచ్చితంగా రసీదు ఇవ్వాలని, బోర్డులపై ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్ష పాటించొద్దు

మల్దకల్: కుల వివక్ష పాటించొద్దని సూపరింటెండెంట్ నర్సన్న అన్నారు. మంగళవారం మండలంలోని బూడిదపాడులో సర్పంచ్ పద్మమ్మ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నర్సన్న, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఆర్‌ఐ నాగిరెడ్డిలు హాజరయ్యారు. గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి అవలంభిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. అంటరానితనం నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిన్న కిష్టన్న, పెద్ద కిష్టన్న, శిఖమణి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్

అయిజ: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక డిగ్రీ పట్టాలు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయించినా ఫలితం దక్కడం లేదన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీరోడ్డు



అయిజ: మండల కేంద్రం నుంచి ఉప్పలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. కొన్ని చోట్ల మోకాల్లోతు గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అనేకసార్లు ప్రమాదాలబారిన పడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫైర్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



హోం మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీకి వినతి పత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం ఎస్పీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి వెళ్తున్న హోం మంత్రిని స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పట్టణ శివారులో గల సర్వేనంబర్ 148లో గల 16గుంట భూమిలో నూతనంగా ఫైర్ స్టేషన్ నిర్మించేందుకు మున్సిపాలిటీ తీర్మాణం ఇచ్చారని, ఫైర్ స్టేషన్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హోం మంత్రిని కలిసిన వారిలో గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, సాక బాలనారాయణ, రాములుయాదవ్, అల్లబాషా, సత్యంయాదవ్, వినోద్‌సాగర్, మహేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



ధరూరులో ఎద్దుల బండ్ల ర్యాలీ



బోనాలతో వస్తున్న మహిళలు

ధరూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని మంగళవారం రైతులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సుంకులమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా గ్రామంలో రైతులు ఎద్దులబండ్ల ర్యాలీ నిర్వహించారు. ఎద్దులను రక రకాల రంగులు అద్ది అందంగా అలంకరించారు. సాయంత్రం ధరూరులోని పుర వీధుల గుండా ఎద్దుల బండ్లతో రైతులు ర్యాలీ నిర్వహించారు. పొలాల వద్ద రైతులు ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.

కార్మిక హక్కుల కోసం నిరంతర పోరాటం



గట్టులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గట్టు: కార్మిక హక్కుల కోసం సీఐటీయూ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా అన్నారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆయన సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని హితువు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వామి, జయన్న, శాతన్న, వెంకటేష్, ఎర్ర నర్సింహులు, బుచ్చన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్: మున్సిపాలిటీలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి నరసింహ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, నరసింహ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా 44 కార్మిక చట్టాలను సాధించామని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి తీరని అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, అంగన్‌వాడీ టీచర్లు నర్మద, సుమలత, రుక్మిణీ, భారతి, రూప, మున్సిపల్ సిబ్బంది లక్ష్మిదేవి, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో అన్నమయ్య సంకీర్తనలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న చంద్రశేఖర్‌రావు బృందం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గద్వాల పట్టణానికి చెందిన కవి, గాయకుడు చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. గ్రామస్తులు భక్తి పారవశ్యంలో మునిగారు. అనంతరం భక్తులు గాయకుడిని అభినందించి సన్మానించారు. జిల్లాలో ఉన్న ప్రతి గుడిలో తమ బృందంతో అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తునట్లు చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, ధీరేంద్రదాసు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం 'అన్నమయ్య వెన్నెల పాటల పంట' అనే కార్యక్రమం నిర్వహించారు. గద్వాల పట్టణానికి చెందిన చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో వారి శిష్య బృందం పాడిన పాటలు అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, అర్చకులు కిష్టాచార్యులు, మధ్వాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



చమన్‌ఖాన్‌దొడ్డిలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

గట్టు: కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బాసు శ్యామల కోరారు. మంగళవారం చమన్‌ఖాన్‌దొడ్డిలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గోవిందమ్మతో కలిసి ఆమె ప్రారంభించారు. ఆలూరు, మాచర్ల, చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామాల్లో మొత్తం 408 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందులో 24 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 31 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు భారతి, కేజీయా, ఈశ్వరమ్మ, ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న నర్మద

గద్వాల అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బిర్జు భూషణ్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని జిల్లా ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెజ్లర్లపై విచక్షణా రహితంగా ప్రవర్తించిన పోలీసుల తీరును ఆమె ఖండించారు. రెజ్లర్లకు న్యాయం జరిగేంత వరకు ఐద్వా ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని అన్నారు. సమావేశంలో నవీన, లక్ష్మి, సరళ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కర్రెప్ప, చెన్నయ్య, వెంకటేష్, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాండ్ల రఘు, జిల్లానాయకులు మెకానిక్ షబ్బీర్, గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలను గుర్తించి నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు తెలిపారు. మస్జిదేనూర్ సమీపంలో నివాసముంటున్న యాసీన్ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని విషయం తెలుసుకుని నిత్యావసర సరుకులతో పాటు నగదును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిరంజన్, కుర్షీద్, ఖాజా, అక్బర్, బుచ్చన్న, నర్సింహ, కృష్ణ, హరీష్‌గౌడ్ ఉన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

శాంతినగర్: హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం అయ్యిందని గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజేంద్రగౌడ్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెలో టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సూర్యకాంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.